క్లుప్తంగా

వైద్య శిబిరంలో 141 మందికి పరీక్షలు

కొలిమిగుండ్ల: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో గురువారం పెట్నికోటలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 141 మందికి సాధారణ వ్యాధులు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైన్స్ జీఎం అజ్మల్ అహ్మద్, ఏజీఎం సతీష్, డాక్టర్ శశిధర్, సంస్థ ఉద్యోగులు మహిపాల్‌రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

25 లీటర్ల సారా స్వాధీనం

ప్యాపిలి: స్థానిక శ్రీరామా టాకీస్ సమీపంలో గురువారం నాటుసారా విక్రయిస్తున్న తప్పెట ఓబులేసును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. అలాగే మట్కా నిర్వహిస్తున్న చందం వెంకటేశ్ నుంచి మట్కా చీటీలతో పాటు రూ.700 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ప్యాపిలి ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


మధుసూదన్

ప్యాపిలి: స్థానిక ఎస్ఐగా మధుసూదన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు త్రీటౌన్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మట్కా, పేకాట, నాటుసారా వంటి అసాంఘిక చర్యలను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

భగత్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్: భగత్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు రణత్‌యాదవ్, సూర్యప్రతాప్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జయరాంకు వినతి పత్రం అందించారు. గుత్తి రోడ్‌లోని అమ్మ హోటల్ వద్ద సెప్టెంబర్ 28వ తేదీ భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రజాక్, శశిధర్‌రెడ్డి ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఏఎస్ఐ లింగమయ్య గురువారం తెలిపారు. కాలనీకి చెందిన నల్లబోతుల బాల మద్దయ్య భార్య మహేశ్వరిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 40 టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పట్టుదలతో చదివితే తప్పక విజయం


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే తప్పక విజయం సాధిస్తారని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలే కానీ వారిపై చిన్నచూపు చూడరాదన్నారు. మొబైల్ ఫోన్లతో గడుపుతూ సమయం వృథా చేసుకోకుండా బాగా చదువుకోవాలని సూచించారు. డీఐఈఓ సునీత, ప్రిన్సిపాల్ రాజిక సత్య ప్రపూర్ణ, సీఐ మంజునాథ్‌రెడ్డి, శీనయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

డోన్ టౌన్: స్వామి వివేకానంద చికాగో నగరంలో ప్రసంగించి 130 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నెల 11వ తేదీ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానందసేవా సమి తి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు సూ చించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కానరాని కంటి వెలుగు

- ప్రభుత్వాస్పత్రుల్లో కంటి పరీక్షలు, అద్దాల పంపిణీకి మంగళం
- కేంద్రాలను ఎత్తివేసిన కూటమి ప్రభుత్వం
- నిరుపేదల కంటి వెలుగును ఆర్పివేసిన సర్కారు
- వెల్లువెత్తుతున్న విమర్శలు

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం అన్నారు. ఇందుకు అనుగుణంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటి వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. కంటి చూపు సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలకే వైద్య సిబ్బంది వెళ్లి నేత్ర పరీక్షలు చేసేవారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందించేవారు. ఆపరేషన్లు అవసరమైన వారికి కర్నూలులోని డాక్టర్ శివారెడ్డి ప్రాంతీయ కంటి వైద్యశాలకు రెఫర్ చేసేవారు. పేదల కంటికి వెలుగునిచ్చిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎత్తివేసింది.


డోన్ ఏరియా ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అసిస్టెంట్(ఫైల్)


ప్రభుత్వాస్పత్రిలో ఖాళీ అయిన ఆప్తాలమిక్ విభాగం

డోన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 10 కంటి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు. ఇక్కడ ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు, అద్దాలు అందించేవారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి రెఫర్ చేసేవారు. ఒక్క డోన్ కేంద్రంలోనే ప్రతి నెలా 800 నుంచి 900 వరకు ఓపీలు చూసేవారు. ఇది రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేది. పేదల ఆశాదీపం, కంటి వెలుగైన ఇలాంటి పథకాలను ఆకస్మికంగా రద్దు చేయడంతో పేదల జీవితాల్లో చీకటి అలుముకుందని చెప్పవచ్చు.

ఆరిపోయిన వెలుగు

గత ప్రభుత్వ హయాంలో ఏటా లక్షలాది మందికి గ్రామీణ ప్రాంతాలతో పాటు ఏరియా ఆస్పత్రుల్లో కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేసి ఎందరి జీవితాలకో వెలుగును ప్రసాదించారు. అయితే మూడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా ప్రజలు భావిస్తున్నారు. తమ పార్టీకి చెందిన వైద్య మాఫియాకు కాంట్రాక్టును అప్పగించే కుట్రలో భాగంగా అర్ధాంతరంగా జగనన్న కంటి వెలుగు పథకాన్ని రద్దు చేశారు. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేద, మధ్యతరగతి ప్రజలు కంటి వైద్యానికి దూరమవుతున్నారు.

రద్దు చేయడం దారుణం



జగనన్న కంటి వెలుగు పథకం ద్వారా ఏటా రాష్ట్రంలో లక్షలాది మందికి కంటి వెలుగును ప్రసాదించిన ఘనత గత ప్రభుత్వానికే దక్కుతుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే కంటి వైద్య సేవలు అందాయి. పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేశారు. ఇలాంటి అద్వితీయమైన పథకాన్ని రద్దు చేయడం కంటి వెలుగును ఆర్పివేయడం లాంటిదే. రాజకీయ కోణంలో గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తీసివేయడం సరికాదు.

–సి.జయ, గృహిణి, పాతపేట, డోన్

దుర్మార్గమైన చర్య



ప్రభుత్వాస్పత్రిలో కంటి వెలుగు పథకాన్ని రద్దు చేయడంతో పాటు ఎంతో ఆధునిక యంత్ర పరికరాలను ఇక్కడి నుంచి తరలించడం పేదలకు అశనిపాతం లాంటిది. ఒకప్పుడు కంటి రోగులతో కళకళలాడే ఆప్తాలమిక్ విభాగం నేడు సేవలు నిలిచిపోవడంతో ఖాళీగా దర్శనమిస్తోంది. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే విధంగా కంటిచూపును ఉచితంగా ప్రసాదించే వ్యవస్థను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య.

–వడ్డె నాగరాజు, రైతు కూలీ, కొత్తకోట, డోన్

కాంట్రాక్టు ముగిసింది



గత ప్రభుత్వ హయాంలో అపోలో హాస్పిటల్ గ్రూప్‌కు వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని అమలు చేసే పనిని అప్పగించారు. కాంట్రాక్టు కాలం ముగియడంతో నూతన ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసి నూతన ఏజెన్సీలకు అప్పగించేందుకు టెండర్లను పిలవాలనుకుంటోంది. ఈ టెండర్ల ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందనేది ప్రభుత్వంపైనే ఆధారపడుతుంది తప్ప మాకేమాత్రం తెలియదు.

–డాక్టర్ హనీఫ్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, డోన్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా గురువారం స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో స్వచ్ఛతతో ప్రతిజ్ఞ చేశారు. జాతిపిత మహాత్మగాంధీ రాజకీయ స్వాతంత్రాన్నే కాకుండా స్వచ్ఛమైన భారతదేశ అభివృద్ధిని ఆకాంక్షించారన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛత హి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈఓపీఆర్డీ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

బేతంచెర్ల: విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకునిరావాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, కొలుములపల్లె సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ అన్నారు. గురువారం కొలుములపల్లె జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. ప్రతిభ చాటే విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


క్రీడలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం సీతారావమ్మ

సంజామల: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉందని ఎంఈఓ ఈశ్వరయ్య అన్నారు. మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా తదితర క్రీడాంశాల్లో అండర్–14, అండర్–17 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు. సుమారు 150 మంది ప్రతిభ చాటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీతారావమ్మ, నాయకులు సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్, బాషా, మౌలాలి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకట సుబ్బయ్య తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్ –14, అండర్–17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా, చెస్, తదితర పోటీలు జరుపుతున్నామన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల పేర్లను ఎంట్రీ ఫాంలో పొందుపరిచి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం


షకీలాసోనిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు శాంతిప్రియ, నరసింహారెడ్డి, అబ్దుల్ లతీఫ్ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న ఏనుగుమర్రి ఉన్నత పాఠశాల టీచర్ షకీలాసోనిని గురువారం సన్మానించారు. సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించిన ఫిజిక్స్ టీచర్ షకీలాసోని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ, వారిలోని సృజనాత్మకతను వెలికితీసే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బొజ్జన్న, కృష్ణానాయక్, సర్వజ్ఞమూర్తి, అంజనప్ప, సురేశ్‌బాబు, ప్రసన్నలక్ష్మి, నాగమద్దయ్య, షేక్షావలి, నరసింహయ్య పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి


చంద్రశేఖర్

డోన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి చంద్రశేఖర్(35) నాలుగు రోజుల క్రితం కృష్ణగిరి మండలం, కోయిలకొండ గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతను చుట్టుపక్కల ప్రాంతాల్లో పాము కాటుకు గురైన వారికి నాటుమందు ఇచ్చేవాడు. కాగా మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అవకాశం ఇవ్వాలి

డోన్ టౌన్: మద్యం షాపుల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హుసేనప్ప డిమాండ్ చేశారు. అలాగే ఉచిత ఇసుక తరలింపునకు సబ్సిడీపై టిప్పర్లు, ట్రాక్టర్లు మంజూరు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.

పూజారి కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు


విద్యార్థినికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ముచ్చట్ల ఆలయ పూజారి చంద్రమోహన్ రావు, వరలక్ష్మీ దంపతుల ప్రథమ కుమార్తె ఇందు ప్రసన్నలక్ష్మి కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 644 మార్కులు వచ్చాయి. పేదలకు వైద్య సేవలు అందించాలనేది తన లక్ష్యమని విద్యార్థిని తెలిపింది. ఈమెకు 10వ తరగతిలో 578 మార్కులు, ఇంటర్మీడియెట్‌లో 985 మార్కులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలోనే సీటు రావడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశ్రమ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పద్మజ

బనగానపల్లె రూరల్: ప్రైవేట్ పరిశ్రమల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఆర్‌ఓ పద్మజ అన్నారు. గురువారం మండలంలోని పలుకూరు గ్రామంలో తలారి మధుసూదన్ రావు అనే పారిశ్రామికవేత్త మైనింగ్ మంజూరు కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవడంతో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మైనింగ్ వెలికి తీయాలని.. వాహనాల్లో తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అలాగే మైనింగ్ పరిశ్రమలో స్థానికులకే ఉపాధి కల్పించాలని, పరిశ్రమకు వచ్చే ఆదాయంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా కలుష్యనియంత్రణ మండలి అధికారి మునిప్రసాద్ కలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను యాజమాన్యానికి వివరించారు. ఇంకా పలువురు గ్రామస్తులు, పర్యావరణవేత్తలు పరిశ్రమ ఏర్పాటుపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. గ్రామ సభలో ప్రజలు, పర్యావరణవేత్తలు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు డీఆర్‌ఓ పద్మజ తెలిపారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ సుమతల, ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్‌ఓ అమర్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా డ్వామా ఎంఅండ్‌ఈ భాస్కర్‌నాయుడు

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద మండలంలో జరిగిన వివిధ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభ గురువారం జరిగింది. ఎంపీపీ మానస వీణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా డ్వామా ఎం అండ్‌ఈ అధికారి భాస్కర్‌నాయుడు, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీడీ అన్వరాబేగం, డోన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ బాలాజీనాయక్, సోషల్ ఆడిట్ బృందం అధికారి మురాజ్, కాంతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరంలో ఎన్ఆర్‌ఈజీఎస్ కింద రూ.13.04 కోట్ల పనులు చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించిన సోషల్ ఆడిట్ ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు జరిగాయన్నారు. మొత్తం రూ.13.04 కోట్ల పనుల్లో రూ.1.42 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, పీఆర్ ఏఈ మహేష్, ఏపీఓ హరికృష్ణ, పాల్గొన్నారు.

రవాణా రంగంలోని సమస్యలను పరిష్కరించాలి


డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్యాపిలి: రవాణారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రాచర్ల ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద లారీ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం రవాణారంగం అన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నంద్యాలలో ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు డ్రైవర్లు తరలిరావాలని కోరారు. యూనియన్ నాయకులు రాజాబాబు, టింగు, చిన్న వెంకటేష్, రంగనాయకులు, రామలింగం, శ్రీనివాసులు, కంబగిరిస్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


డోన్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో కమిషనర్ జయరాం


అవుకులో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి

డోన్ టౌన్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ జయరాం, హెచ్‌ఎం పద్మావతి పిలుపునిచ్చారు. గురువారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తెలిపారు. విద్యార్థులు పాఠశాలతో పాటు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు కమిషనర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, వెంకటలక్ష్మి, సుబ్బరాయుడ, హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓలు శ్రీధర్ రావు, వెంకటేశ్వర రెడ్డి, ఏపీఎం విజయగోపాల్ పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు తప్పని తిప్పలు


డోన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు బారులు తీరిన ప్రజలు

డోన్ టౌన్: ఆర్‌బీఐ ఆదేశాల మేరకు జూలై నెల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఫోన్‌పే, గుగూల్ పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులను ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్) రద్దు చేసింది. దీంతో విద్యుత్ వినియోగదారులు దగ్గరిలోని విద్యుత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన బిల్లుల చెల్లింపు కేంద్రాలకు వెళ్లి నగదు చెల్లింపులను చేయాల్సిన పరిస్థితి నెలకొంది. డోన్ కేంద్రంలో అధికారులు ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల రద్దీ ఎక్కువగా ఉండడం, ఆన్‌లైన్ నెట్‌వర్క్ సరిగ్గా లేక సిగ్నల్ సమస్యతో బిల్లింగ్‌కు తీవ్ర జాప్యం కలుగుతోంది. బిల్లుల చెల్లింపు కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీలోగా బిల్లు పొందిన వారు 15 రోజుల్లో చెల్లింపు చేయాల్సి ఉంటుంది. లేకుంటే సర్‌చార్జ్ భారం పడుతుంది. సర్‌చార్జ్‌తో కూడా 15 రోజుల్లోపు బిల్లు చెల్లించకుంటే కనెక్షన్ తొలగించి రీ కనెక్షన్ కోసం రూ.100 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. సర్‌చార్జ్ కాలం ముగుస్తుండడంతో మూడు రోజులుగా కౌంటర్ వద్ద రద్దీ ఎక్కువగా ఉంటోంది. రద్దీని చూసి అధికారులు అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డోన్‌లో 41 వేల విద్యుత్ కనెక్షన్లు

డోన్ పట్టణంలో 24 వేల కనెక్షన్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో 17 వేల మంది వినియోగదారులతో కలిపి మొత్తం 41 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో నెల సుమారు రూ.1.67 కోట్ల బిల్లులు వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు కమర్షియల్ కింద 1,471 కనెక్షన్‌లు ఉన్నాయి. వీటి వసూళ్ల కోసం పట్టణానికి సంబంధించి ఇద్దరు, గ్రామీణ ప్రాంతాలకు ముగ్గురు ఉండాలి. అయితే ప్రస్తుతం పట్టణానికి ఒక్కరు, గ్రామీణ ప్రాంతాలకు ఇద్దరు మాత్రమే ఉన్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు

వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో డిజిటల్ పేమెంట్ కింద చెల్లించవచ్చు. ఉదయం మాత్రమే ఒక్క కౌంటర్ ఉంటుంది. మధ్యాహ్నం తరువాత గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వచ్చిన ఆర్‌సీ (రెవెన్యూ కలెక్షన్)తో రెండో కేంద్రం ద్వారా వసూలు చేయిస్తాం. నాన్ స్లాబ్ (కమర్షియల్)వాళ్లు రూ.10వేలు బిల్లు దాటితే బ్యాంక్‌లోనే చెల్లించాలి. సిబ్బంది కొరత కారణంగా ప్రతి రోజు రెండు కేంద్రాలు ఏర్పాటు కష్టం అవుతుంది. అయితే 19వ తేదీ తరువాత ప్రతి రోజు రెండు కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకున్నాం.

–కృష్ణానాయక్, జేఈఓ, డోన్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బనగానపల్లె: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

సంజామల: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని సంజామల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. మండల పరిధిలోని కమలపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పౌష్టికాహార మహోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిరుధాన్యాల, కూరగాయల పదర్శన ఏర్పాటు చేశారు. కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిదని తెలిపారు.

అవుకు: సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావని, శివమ్మ అన్నారు. అవుకు, సంగపట్నం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తాజా ఆకుకూరలు, పండ్లు, ఉడికించిన కోడిగుడ్లు, పాలు తీసుకోవాలన్నారు. అలాగే ఎక్కువ పోషకాలు కలిగిన మొలకెత్తిన గింజలు తినడం వల్ల పిల్లలు చురుగ్గా ఉంటారని తెలిపారు.

బనగానపల్లె: పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ రక్తహీనతకు గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.